తెలంగాణభవన్‌లో గురువారం నిర్వహించిన కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాల పార్టీ ముఖ్యనేతల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. చిత్రంలో పార్టీ సెక్రటరీ జనరల్ కే కేశవరావు, ఎమ్మెల్యేలు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, హరీశ్‌రావు, గంగుల కమలాకర్, పాడి కౌశిక్‌రెడ్డి, ఎమ్మెల్సీలు మధుసూదనాచారి, మహమూద్ అలీ, బీఆర్ఎస్ నేతలు వినోద్‌కుమార్, పెద్దిరెడ్డి, వొడితెల సతీశ్ తదితరులు

ఊరూరా గులాబీ దళం

మొదటిపేజీ తరువాయి...

కేటీఆర్ తెలిపారు. గురువారం తెలంగాణ భవన్‌లో కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గంలోని పార్టీ ముఖ్యనేతలతో విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. సమావేశంలో కేటీఆర్‌తోపాటు మాజీ స్పీకర్లు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, సిరికొండ మధుసూదనాచారి, మాజీ ఉపముఖ్యమంత్రులు కడియం శ్రీహరి, మహమూద్ అలీ, మాజీ మంత్రులు తన్నీరు హరీశ్‌రావు, గంగుల కమలాకర్, ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్, మాజీ ఎమ్మెల్యేలు సుంకె రవిశంకర్, రసమయి బాలకిషన్, జెడ్పీ చైర్మన్లు, మున్సిపల్ చైర్మన్లు, మాజీ జెడ్పీ చైర్మన్లు, కార్పొరేషన్ల మాజీ చైర్మన్లు, కరీంనగర్ లోక్‌సభ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పార్టీ ముఖ్యనేతలు పాల్గొన్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఆయా అసెంబ్లీ నియోజకవర్గాల్లో వచ్చిన ఓట్లు, కాంగ్రెస్, బీజేపీకి పోలైన ఓట్ల వివరాలను విశ్లేషించారు. భవిష్యత్తులో అనుసరించాల్సిన వ్యూహంపై సుదీర్ఘంగా చర్చించారు. ఉదయం నుంచి సాయంత్రం దాకా జరిగిన సమావేశంలో కరీంనగర్ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో పార్టీ బలం, బీఆర్ఎస్ పట్ల ప్రజల్లో ఉన్న ఆదరణ తదితర అంశాలపై కూలంకశంగా చర్చించారు. ఉదయం ప్రారంభమైన సమావేశంలో కే కేశవరావు, కడియం శ్రీహరి, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, హరీశ్‌రావు, వినోద్ కుమార్ ప్రసంగించారు. కాంగ్రెస్ ఎన్నికల హామీలు, కేసీఆర్ సర్కార్‌పై ప్రజల్లో సృష్టించిన అపోహలు, చేసిన అసత్యప్రచారాలు, అధికారంలోకి రాగానే హామీల అమలులో చేస్తున్న జాప్యం, ప్రజల్లో వ్యక్తమవుతున్న అభిప్రాయాలపై చర్చించారు. మధ్యాహ్న భోజన విరామం అనంతరం పార్టీ కార్యకర్తలు, నాయకులు వారి వారి ప్రాంతాల్లో నెలకొన్న వాస్తవ పరిస్థితులు, భవిష్యత్తులో పార్టీ అనుసరించాల్సిన వ్యూహంపై పలు సూచనలు చేశారు. కొంతమంది పార్టీ నేతలే పట్టించుకోకపోవడం, కొంతమంది అభిప్రాయాలనే వినడం వంటి అంశాలు పార్టీకి ఏవిధంగా నష్టం చేశాయో వివరిస్తూ వారి అనుభవాలను రాష్ట్ర నాయకత్వం దృష్టికి తీసుకెళ్లారు. ప్రజల్లో కేసీఆర్ పట్ల, కేసీఆర్ సర్కార్ అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాల పట్ల ఉన్న ఆదరణను ఉదహరణలతో వివరించారు. అనంతరం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు.

తెలంగాణభవన్‌లో గురువారం కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకుల పేర్లను నమోదు చేసుకుంటున్న సిబ్బంది. చిత్రంలో హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీశ్

ప్రజలే కేంద్రంగా పాలన

అనేక దశాబ్దాలు పోరాడి సాధించుకున్న రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలనే ఒకే ఒక్క వజ్రసంకల్పంతో పార్టీ అధినేత కేసీఆర్ వ్యవహరించారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గులాబీ శ్రేణులకు సోదాహరణంగా వివరించారు. ప్రజల యోగక్షేమాలే పరమావధిగా కేసీఆర్ సర్కార్ పనిచేసిందని చెప్పారు. ప్రజాప్రయోజనాలే కేంద్రంగా కేసీఆర్ పాలన సాగించారని, ఒక్కో పథకం లబ్ధిదారుల ఎంపిక, వారికి చేకూరే ప్రయోజనాలు నేరుగా ప్రజలకు చేరాలన్న దృఢ సంకల్పంతో ముందుకు సాగారని వివరించారు. అయితే పార్టీ కార్యకర్తలు, నాయకులను పట్టించుకోవాల్సిన స్థాయిలో పట్టించుకోలేకపోయామని అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో కేసీఆర్ సర్కార్‌పై అన్ని పక్షాలు ఏకమై చేసిన దుష్ప్రచారాన్ని అడ్డుకోలేకపోయామన్నారు. ప్రభుత్వ పథకాల్లో పార్టీ శ్రేణులను భాగస్వాములను చేయలేకపోయామని, ఫలితంగా పార్టీకి, ప్రజలకు మధ్య వారధి లేకుండా పోయిందని చెప్పారు.

నేడు చేవెళ్ల సమావేశం

చేవెళ్ల లోక్‌సభ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల ముఖ్యకార్యకర్తల సమావేశం శుక్రవారం తెలంగాణభవన్‌లో జరుగనున్నది.

తెలంగాణ భవన్‌లో గులాబీ కోలాహలం

తెలంగాణభవన్ గులాబీ శ్రేణులతో కోలాహలంగా మారింది. గురువారం కరీంనగర్ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోని ముఖ్యనేతల సమావేశం జరిగింది. కరీంనగర్ లోక్‌సభ పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాల రిసెప్షన్ కౌంటర్లు, ఆయా నియోజవకార్గల నుంచి వచ్చిన పార్టీ శ్రేణుల నమోదు, వారికి కిట్స్ అందజేశారు. ఇటీవల బీఆర్ఎస్ విడుదల చేసిన 'కాంగ్రెస్ 420 హామీలు', 'తెలంగాణ స్వేదపత్రం', కరీంనగర్ లోక్‌సభ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో పార్టీల వారీగా వచ్చిన ఓటింగ్ షీట్, పెన్ను, హ్యాండ్‌బుక్‌ను రిసెప్షన్‌లో పార్టీ శ్రేణులకు అందజేశారు.

బీజేపీని నిలువరించే సత్తా బీఆర్ఎస్‌కే

తెలంగాణ సాధించిన విజయాలను వైఫల్యాలుగా చిత్రీకరించే ప్రయత్నం కాంగ్రెస్ చేస్తున్నదని, దీనిని ఎక్కడికక్కడ ఎండగట్టాల్సిన గురుతర బాధ్యత బీఆర్ఎస్ పార్టీ శ్రేణులపై ఉన్నదని సమావేశం అభిప్రాయపడింది. కేవలం కేసీఆర్‌పైన వ్యతిరేకతతో తెలంగాణ ప్రయోజనాలను తాకట్టుపెట్టేలా ప్రవర్తిస్తున్న తీరు మంచిది కాదని పేర్కొన్నది. బీజేపీని అనేక స్థానాల్లో ఓడించింది బీఆర్ఎస్ మాత్రమేనని, బండి సంజయ్, ధర్మపురి అర్వింద్, ఈటల రాజేందర్, సోయం బాపురావులను ఓడగొట్టింది బీఆర్ఎస్ అనే విషయాన్ని కాంగ్రెస్ గుర్తించుకోవాలని స్పష్టంచేసింది. తమను బీజేపీకి బీ టీం అంటూ సాగించిన దుష్ప్రచారాన్ని ఈ ఫలితాల ద్వారా ప్రజల ముందు ఎండగట్టాలని సూచించింది.

గురువారం తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గంగుల కమలాకర్. చిత్రంలో మాజీ ఎంపీ వినోద్‌కుమార్, పార్టీ నేతలు సుంకె రవిశంకర్, లక్ష్మీనర్సింహారావు

కాంగ్రెస్‌లో ఒక్కరూ మిగలరు

- ఒక్కరిని మీరు తీసుకెళ్తే పది మంది మాకొస్తరు
- కేసీఆర్ మాకు దైవసమానులు
- కరీంనగర్ నియోజకవర్గ సమీక్ష అనంతరం గంగుల కమలాకర్

హైదరాబాద్, జనవరి 4 (నమస్తే తెలంగాణ): 'ఒక్కరిని మీరు తీసుకెళ్తే పది మంది మాకొస్తరు' అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ కాంగ్రెస్ నేతలను ఉద్దేశించి హెచ్చరించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలందరికీ కేసీఆర్ దైవసమానులని, ఒక్క ఎమ్మెల్యే కూడా కాంగ్రెస్‌లోకి వెళ్లడని చెప్పారు. 'ఒకవేళ వాళ్లు మా వాళ్లను తీసుకెళ్లాలని చూసినప్పుడు, మేము గేట్లు తెరిస్తే కాంగ్రెస్‌లో ఎవ్వరూ మిగలరు' అని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చే ఉద్దేశం తమకు లేదని స్పష్టంచేశారు. కాంగ్రెస్‌కు ప్రజలు అధికారం ఇచ్చారని, ఎన్నికల హామీలను నిలబెట్టుకోవాలని మాత్రమే సూచిస్తున్నామని పేర్కొన్నారు. గురువారం తెలంగాణభవన్‌లో కరీంనగర్ లోక్‌సభ స్థానం పరిధిలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాల పార్టీ ముఖ్యనేతలతో సమావేశం జరిగింది. అనంతరం ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్, మాజీ ఎమ్మెల్యేలు రసమయి బాలకిషన్, ఒడితెల సతీశ్‌కుమార్, సుంకె రవిశంకర్, పార్టీ నేతలు చల్మెడ లక్ష్మీనర్సింహారావు, తుల ఉమ, రామకృష్ణారావు తదితరులతో కలిసి గంగుల కమలాకర్ మీడియాతో మాట్లాడారు. తమకు ఓపిక లేదని రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పేర్కొనడాన్ని ఆయన తప్పుబట్టారు. ఎన్నికల సమయంలో డిసెంబర్ 9 నుంచి రైతుబంధు ఇస్తామని, రైతురుణమాఫీ చేస్తామని, రైతులు పండించిన పంటలకు క్వింటాలుకు రూ.500 చొప్పున బోనస్ ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. రైతులు దుక్కి దున్ని ప్రభుత్వ సహాయం కోసం ఎదురుచూస్తున్నారని, వారికి సకాలంలో రైతుబంధు నిధులు ఇవ్వాలని కోరారు. ప్రజలకు వివిధ పథకాలను ఫలానా తేదీలోగా ఇస్తామని చెప్పింది మీరా..మేమా? అని ప్రశ్నించారు. ఆయా హామీలను నిలబెట్టుకోవాలని బాధ్యతాయుత ప్రతిపక్ష పార్టీగా గుర్తుచేస్తున్నామని చెప్పారు. తాము రైతుల పక్షాన నిలబడటం తప్పా? అని ప్రశ్నించారు. రైతులకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలని కోరితే తొందరపడుతున్నారని అనడం భావ్యమా? అని ప్రశ్నించారు.

కరీంనగర్‌లో బీఆర్ఎస్‌కే ఆధిక్యం

వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కరీంనగర్‌లో గులాబీ జెండా ఎగరేస్తామని గంగుల కమలాకర్ ధీమా వ్యక్తంచేశారు. బీజేపీని నిలువరించేది బీఆర్ఎస్‌యేనని చెప్పారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఉన్నా ఎంపీ బండి సంజయ్ కరీంనగర్ అభివృద్ధిని ఏనాడూ పట్టించుకోలేదని విమర్శించారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా కేసీఆర్ లేని లోటు, కరీంనగర్‌లో బోయినపల్లి వినోద్‌కుమార్ ఎంపీగా లేని లోటు కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నదని ప్రజలు భావిస్తున్నారని చెప్పారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కరీంనగర్ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో కాంగ్రెస్ కంటే బీఆర్ఎస్‌కే 5,600 ఓట్లు అధికంగా వచ్చాయని చెప్పారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో నియోజకవర్గం పరిధిలోని అన్ని పోలింగ్ బూత్‌ల్లో బూత్‌కు 100 ఓట్ల ఆధిక్యం సాధించాలన్న పట్టుదల బీఆర్ఎస్ శ్రేణుల్లో ఉన్నదని పేర్కొన్నారు. బీఆర్ఎస్ బలోపేతానికి కార్యకర్తలు ఇచ్చిన సూచనలను పరిగణనలోకి తీసుకుంటామని కేటీఆర్ భరోసా ఇచ్చారని తెలిపారు.

మీరా కూకటివేళ్లతో పెకిలించేది!

బీఆర్ఎస్‌ను కూకటివేళ్లతో పెకిలిస్తామని ఎంపీ బండి సంజయ్ పేర్కొనడంపై గంగుల కమలాకర్ ఫైరయ్యారు. బీజేపీలో సీఎం అభ్యర్థులుగా చెప్పుకున్న బండి సంజయ్, ఈటల రాజేందర్, ధర్మపురి అర్వింద్‌ను ఓడించిందే బీఆర్ఎస్ అని చురకలేశారు. సంజయ్ మూడు సార్లు ఓడిపోయారని, అలాంటి వ్యక్తి బీఆర్ఎస్‌ను కూకటివేళ్లతో పెకిలిస్తారా? అని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లోకి వస్తారం టూ ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను పట్టించుకోవాల్సిన అవసరం లేదన్నారు.

మల్కాజిగిరి ఎంపీగా పోటీచేస్తా

- అధిష్ఠానం ఆదేశిస్తే బరిలోకి
- ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి

మేడ్చల్, జనవరి 4 (నమస్తే తెలంగాణ): అధిష్ఠానం ఆదేశిస్తే మల్కాజిగిరి లోక్‌సభ బరిలో ఉంటానని బీఆర్ఎస్ ఎమ్మెల్యే మల్లారెడ్డి అన్నారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ 'నాకు గతంలో మల్కాజిగిరి ఎంపీగా పనిచేసిన అనుభవం ఉన్నది. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని ఐదు అసెంబ్లీ నియోజకవర్గాలు మేడ్చల్, మల్కాజిగిరి, ఉప్పల్, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు భారీ మెజార్టీతో విజయం సాధించారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లోనూ ఇదే తరహాలో ప్రజలు బీఆర్ఎస్‌ను అదరిస్తారు. రాష్ట్రంలో అత్యధిక లోక్‌సభ స్థానాలను బీఆర్ఎస్ గెలుచుకుంటుంది' అని ఆయన తెలిపారు. పార్టీ అధిష్ఠానం ఇప్పటికే ఎంపీ స్థానాల గెలుపుపై ఫోకస్ చేసిందని, లోక్‌సభ స్థానాల వారీగా సమీక్షలు నిర్వహించి పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయనున్నట్టు వెల్లడించారు. తాను పోటీ చేసే విషయంపై అధిష్ఠానమే నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు. ఈ నెల 21 తెలంగాణభవన్‌లో మల్కాజిగిరి పరిధిలోని ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు సమీక్ష ఉంటుందని పేర్కొన్నారు.

కాంగ్రెస్ 420 పార్టీయే!

- బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ వై సతీశ్‌రెడ్డి

హైదరాబాద్, జనవరి 4 (నమస్తే తెలంగాణ): అధికారంలోకి వచ్చిన మొదటి 10 రోజుల్లోనే 30 లక్షల మంది నిరుద్యోగ యువతను మోసం చేసిన కాంగ్రెస్ సర్కారు నూరు శాతం 420 పార్టీయేనని బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ వై సతీశ్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. మ్యానిఫెస్టోలో చెప్పిన మాటను.. అధికారంలోకి వచ్చాక మార్చేసిందని గురువారం ఒక ప్రకటనలో మండిపడ్డారు. అధికారం రాకముందు టీఎస్పీఎస్సీని రద్దు చేయాలని ఆందోళనలు చేశారని, ఇప్పుడు చైర్మన్ రాజీనామా చేశాక.. కమిషన్ చైర్మన్ లేకుండా ఉద్యోగాలు ఇవ్వలేమని అనడం మోసం కాదా? అని ప్రశ్నించారు. మెగా డీఎస్సీ, ఫిబ్రవరి 1న గ్రూప్ 1 అపాయింట్లు ఇస్తామని మోస్తం చేస్తున్నది కాంగ్రెసే అని చెప్పారు.

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను పరామర్శించేందుకు గురువారం బంజారాహిల్స్‌లోని ఆయన నివాసానికి వచ్చిన ఏపీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలుకుతున్న పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు, ఎమ్మెల్యేలు తలసాని శ్రీనివాస్‌యాదవ్, పాడి కౌశిక్‌రెడ్డి, ఎమ్మెల్సీ మహమూద్ అలీ

8 నెలల్లో లక్షన్నర కోట్లు!

మొదటిపేజీ తరువాయి...



జీఎస్టీనే అగ్రస్థానం పొందింది. ఈ ఆర్థిక సంవత్సరంలో జీఎస్టీ రాబడి రూ.50,942 కోట్లు వస్తుందని ఆశించగా, మొదటి ఎనిమిది నెలల్లోనే రూ.30,047 కోట్లు వచ్చింది. బడ్జెట్ అంచనాల్లో ఇది 59%. స్టాంపులు, రిజిస్ట్రేషన్ల రూపంలో రూ.9,355 కోట్లు, అమ్మకం పన్ను కింద రూ.19,591 కోట్ల ఆదాయం వచ్చింది. కేంద్ర పన్నుల వాటా రూ.39,500 కోట్లు వస్తుందని ఆర్థిక శాఖ అంచనా వేయగా నవంబర్ వరకు రూ.8,177 కోట్లు మాత్రమే వచ్చింది. ఎప్పటిలాగే గ్రాంట్ ఇన్ ఎయిడ్‌లో ఈ సారి కూడా కేంద్రం వివక్ష కొనసాగించింది. కేంద్రం నుంచి గ్రాంట్ రూపంలో తెలంగాణకు రూ.41,259 కోట్లు వస్తుందని అంచనా వేయగా మొదటి ఎనిమిది నెలల్లో వచ్చింది రూ.4,533 కోట్లు మాత్రమే. అంచనాల్లో ఇది 11 శాతమే. గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే అన్నింటా వృద్ధిని సాధించిన తెలంగాణకు కేంద్రం గ్రాంట్ ఆశించిన మేరకు ఇస్తే రాష్ట్ర ఆర్థిక పరిస్థితి మరింత ఆశాజనకంగా ఉండేది.

2023-24 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర రాబడులు (రూ.కోట్లలో...)

అంశం	అంచనా	రాబడి	శాతం
జీఎస్టీ	50,942.66	30,047.59	58.98
స్టాంపులు, రిజిస్ట్రేషన్లు	18,500.00	9,354.84	50.57
అమ్మకం పన్ను	39,500.00	19,591.91	49.60
కేంద్ర పన్నుల వాటా	14,528.18	8,177.58	56.29
ఎక్సైజ్ డ్యూటీలు	19,884.90	14,607.58	73.46
ఇతర పన్నులు, డ్యూటీలు	9,131.70	5,304.21	58.09
పన్నేతర రాబడి	22,808.31	19,524.69	85.60
గ్రాంట్ ఇన్ ఎయిడ్	41,259.17	4,532.74	10.99
అప్పులు	38,234.94	38,151.01	99.78
ఇతరాలు	5,060.00	24.26	0.47
మొత్తం	**2,59,861.91**	**1,49,316.41**	**57.46**

ఉమెన్ సేఫ్టీలో హైదరాబాద్ షా

- భారతదేశంలో టాప్-5 నగరాల్లో హైదరాబాద్
- ఇక్కడి జీవనంపై 87.5 శాతం మంది సంతృప్తి
- టాప్ సిటీస్ ఫర్ ఉమెన్ ఇన్ ఇండియా సర్వేలో వెల్లడి
- పదేండ్ల కేసీఆర్ పాలనలో శాంతిభద్రతల ఫలితమిది



హైదరాబాద్, జనవరి 4 (నమస్తే తెలంగాణ): 'యత్ర నార్యస్తు పూజ్యంతే రమంతే తత్ర దేవత'.. ఎక్కడైతే స్త్రీలు గౌరవింపబడతారో అక్కడ దేవతలు కొలువై ఉంటారు.. అనే స్ఫూర్తి తెలంగాణలో విరాజిల్లుతున్నది. పదేండ్ల పాలనలో కేసీఆర్ తీసుకొచ్చిన సంస్కరణల కారణంగా హైదరాబాద్ నగరంలో మహిళలు భద్రంగా, భరోసాతో జీవనం సాగిస్తున్నారు. ఉమెన్ సేఫ్టీ వింగ్‌తో మహిళ భద్రతే తమ తొలి ప్రాధాన్యమని కేసీఆర్ చాటిచెప్పారు. మహిళా సమస్యసలపై 'సాహస్'అస్త్రాన్ని సంధించారు. షీ టీమ్ తీసుకొచ్చి పోకిరీల్లో వణుకు పుట్టించారు. పసిపాప నుంచి కాలేజీకి వెళ్లే అమ్మాయి వరకు, ఇంట్లో గృహిణి నుంచి పనిప్రదేశంలో మహిళ వరకు అందరికీ నేనున్నానంటూ 'భరోసా' కల్పించారు. ఇటువంటి ఎన్నో గొప్ప గొప్ప సంస్కరణలతో హైదరాబాద్ నగరాన్ని ఆడబిడ్డలకు రక్షణ వలయంగా తీర్చిదిద్దారు. తాజాగా మహిళల సంరక్షణ, ఉపాధి, వసతి, పని ప్రదేశాల్లో భద్రత వంటి 17 అంశాల్లో అవతార్ సంస్థ నిర్వహించిన ప్రత్యేక సర్వేలో దేశంలోని టాప్-5 నగరాల్లో హైదరాబాద్ చోటు దక్కించుకున్నది. డైవర్సిటీ, ఈక్విటీ అండ్ ఇన్‌క్లూజన్ (డీఈఐ) సొల్యూషన్స్‌లో అగ్రగామి సంస్థగా పేరొందిన అవతార్ దేశవ్యాప్తంగా 113 నగరాల్లో 'టాప్ సిటీస్ ఫర్ ఉమెన్ ఇన్ ఇండియా-2023' పేరుతో సర్వే నిర్వహించింది. జూలై 2023- డిసెంబర్ 2023 మధ్య దేశంలోని 1,200 మంది మహిళల అభిప్రాయాలు సేకరించింది. పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే, జాతీయ జనాభా గణన, నేరాల రికార్డులతోపాటు వివిధ ప్రభుత్వ వనరుల నుంచి సేకరించిన డాటాలను కూడా సర్వేలో పరిగణలోకి తీసుకున్నది. సోషల్ ఇన్‌క్లూషన్ స్కోర్ (ఎస్ఐఎస్), ఇండస్ట్రియల్ ఇన్‌క్లూజన్ స్కోర్(ఐఐఎస్), సిటిజన్ ఎక్స్‌పీరియన్స్ స్కోర్ (సీఈఎస్) వంటివన్నీ పరిగణనలోకి తీసుకొని సర్వే చేపట్టింది. 10 లక్షల కంటే ఎక్కువ జనాభా ఉన్న నగరాల జాబితాలో హైదరాబాద్ ఐదో స్థానంలో నిలిచింది. మొదటి స్థానంలో చెన్నై, రెండోస్థానంలో బెంగళూరు, మూడోస్థానంలో పుణె, నాలుగోస్థానంలో ముంబై ఉన్నాయి. ఆరు నుంచి పదో స్థానం వరకు వరుసగా కోల్‌కతా, అహ్మదాబాద్, ఢిల్లీ, కోయంబత్తూర్, జైపూర్ నిలిచాయి.

సర్వేలో మొదటి 10 స్థానాల్లో నిలిచిన నగరాలు

నగరం	ఎస్ఐఎస్	ఐఐఎస్
చెన్నై	53.1	52.8
బెంగళూరు	43.4	62.3
పుణె	47.9	46.3
ముంబై	43.3	47.8
హైదరాబాద్	42.2	46.4
కోల్‌కతా	39.5	39
అహ్మదాబాద్	41.0	30.4
ఢిల్లీ	35.5	30.8
కోయంబత్తూర్	52.8	26.7
జైపూర్	42.9	26.5

హైదరాబాద్‌లో జీవనంపై 87.5 శాతం మంది సంతృప్తి

దేశంలోని 113 నగరాల్లో జీవించడంపై ఎంతమంది సంతృప్తితో ఉన్నారు? ఎంత మంది ఇబ్బందులు పడుతున్నారు? వంటి అంశాలను అవతార్ సంస్థ వెల్లడించింది. పిల్లల విద్య, ఉన్నత విద్య, హెల్త్‌కేర్, ఉద్యోగ అవకాశాలు, పిల్లల సంరక్షణ, వినోదం, సేఫ్టీ, హౌసింగ్, ఉత్తమ జీవన ప్రమాణాలు, రవాణా సౌకర్యం, ఇంటి అద్దెలు, ఉమెన్ హాస్టల్స్, తాత్కాలిక వసతి సౌకర్యాలు, బిల్డింగ్ నెట్‌వర్క్, గ్రీన్ స్పేస్, ప్రభుత్వ సంస్థల స్పందన, మహిళా పోలీస్ అధికారులు అనే అంశాలను వివరించింది. అందులో హైదరాబాద్‌లో జీవించడంపై 50 శాతం మంది స్త్రీలు చాలా సంతోషంగా ఉన్నారు. 37.5 శాతం మంది స్త్రీలు ఎటువంటి ఇబ్బంది లేకుండా జీవిస్తున్నామనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. 12.5 శాతం మంది మాత్రం కొంత ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. చెన్నైలో 55.6 శాతం మంది పాజిటివ్ అభిప్రాయాన్ని చెప్పగా, 44.4 శాతం మంది తటస్థంగా ఉన్నారు. శక్తివంతమైన ఉపాధి అవకాశాలు, విద్య, ఆరోగ్యం, సంరక్షణ, ఉత్తమ జీవన ప్రమాణాలు వంటి విషయాల్లో దేశంలోని టాప్-5 నగరంగా హైదరాబాద్ నిలిచిందని అవతార్ సంస్థ ఫౌండర్ డాక్టర్ సౌందర్య రాజేశ్ తెలిపారు.

పదేండ్లలో ఎన్నో సంస్కరణలు

తెలంగాణ రాష్ట్రంలో కేసీఆర్ సర్కారు మహిళల రక్షణ, అభివృద్ధికి ఎన్నో గొప్ప సంస్కరణలు ప్రవేశ పెట్టింది. దేశంలోనే తొలిసారిగా ఉమెన్ సేఫ్టీ వింగ్‌ను ప్రారంభించారు. ఆడబిడ్డకు ఆపదొస్తే 'షీ టీమ్స్' గుర్తుకు వచ్చేలా వ్యవస్థను తీర్చిదిద్దారు. ఉమెన్ సేఫ్టీ వింగ్‌లో ప్రధానంగా ఎనిమిది విభాగాలు నిరంతరం పనిచేస్తున్నాయి. షీ టీమ్, భరోసా, సాహస్, ఎన్ఆర్ఐ సెల్, ఫ్రైడ్ ప్లేస్ సెల్, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్, ఆపరేషన్ స్మైల్ అండ్ ముస్కాన్, సైబర్ అంబాసిడర్ ప్లాట్‌ఫామ్(సీఏపీ)లు నిరంతరం స్త్రీల కోసం పనిచేస్తున్నారు. లైంగిక బాధితులకు అండగా ఉండేందుకు ఉమెన్ సేఫ్టీ వింగ్‌లోనే 'భరోసా' విభాగం పనిచేస్తున్నది. మృగాళ్ల వేధింపులు అరికట్టేందుకు 'సాహస్' అనే (మాడ్యూల్) తీసుకొచ్చారు. మానవ అక్రమ రవాణాను అడ్డుకోవడంలో ఉమెన్ సేఫ్టీ వింగ్‌లోని 'యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్' మాడ్యూల్ తీవ్రంగా శ్రమిస్తున్నది. రాష్ట్రవ్యాప్తంగా 30 ఏహెచ్‌టీ యూనిట్ల నుంచి తన పనిని నిర్వర్తిస్తున్నది. ఇలా.. ప్రతి వింగ్‌కు సమర్థ అధికారులను నియమించారు. ఫలితంగా.. దేశంలోనే సేఫ్టీ ప్రదేశాల్లో హైదరాబాద్ టాప్ 5 నగరాల్లో నిలిచింది.

ఉమెన్ సేఫ్టీ వింగ్

షీ టీమ్, భరోసా, సాహస్, ఎన్ఆర్ఐ సెల్, ఫ్రైడ్ ప్లేస్ సెల్, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్, ఆపరేషన్ స్మైల్ అండ్ ముస్కాన్, సైబర్ అంబాసిడర్ ప్లాట్‌ఫామ్ (సీఏపీ).

సర్కారు వలంటీర్లు!

- 80 వేల మంది కార్యకర్తలను నియమించే చాన్స్
- వలంటీర్లుగా కార్యకర్తల ఎంపికకు సీఎం సంకేతం
- ఇందిరమ్మ కమిటీలు కూడా అందులో భాగమే!

హైదరాబాద్, జనవరి 4 (నమస్తే తెలంగాణ): ఆంధ్రప్రదేశ్‌లో అమల్లో ఉన్న వలంటీర్‌లాంటి వ్యవస్థ తెలంగాణలోనూ రాబోతున్నదా? అది కాంగ్రెస్ కార్యకర్తలకు ఉపాధిగా మారబోతున్నదా? ఈ ప్రశ్నలకు అవుననే సమాధానం వినిపిస్తున్నది. తాము అధికారంలోకి వస్తే కార్యకర్తలను వలంటీర్లుగా నియమిస్తామని ఎన్నికల సమయంలో రేవంత్‌రెడ్డి విస్పష్టంగా చెప్పారు. ఇప్పుడు దీనిని అమలు చేయబోతున్నట్టు తెలుస్తున్నది. ఇందులో భాగంగానే 'ఇందిరమ్మ కమిటీ'లను ఏర్పాట్లు చేస్తున్నట్టు చెప్తున్నారు. ఇప్పటికే కార్యాచరణ ప్రారంభమైనట్టు సమాచారం. ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరువ చేయడంతోపాటు పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్లడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిసింది. ఇందుకు సంబంధించి త్వరలోనే అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉందని చెప్తున్నారు.

'ఇందిరమ్మ కమిటీ'లు అందుకేనా?

ఆరు గ్యారెంటీల అమలు, కార్యకర్తలకు ఉపాధి కల్పన, ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం వంటివాటికి సంబంధించి ప్రభుత్వం పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్తున్నది. వలంటీర్ల నియామకంలో భాగంగానే 'ఇందిరమ్మ కమిటీ'లను తెరపైకి తీసుకొచ్చారన్న ప్రచారం జరుగుతున్నది. ఆరు గ్యారెంట